క్లుప్తంగా

పనులు సకాలంలో పూర్తి చేయండి



అయిజ: బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ ఆంజనేయుడు ఆదేశించారు. గురువారం అయిజ సమీపంలో చిన్న తాండ్రపాడు రోడ్డువద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పీఆర్ డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాగుపై రూ.40 లక్షలతో చేపట్టిన బ్రిడ్జి పనులను రానున్న వర్షాకాలంలోపు పూర్తిచేయాలని, నిబంధనల మేరకు నాణ్యత లోపించకుండా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈలు లక్ష్మీకాంత రెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రయాణం ప్రమాదకరం



మల్దకల్: గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు చెలగాటం ఆడుతున్నారు. నిత్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్ మండలంలోని గ్రామాలకు కూలీలను పరిమితికి మించి తరలిస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 40మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన ఎరుకలి బుచ్చన్న అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు సేవాదళం అధ్యక్షుడు పోతురాజు సోమనాద్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట భాస్కర్, గట్టుబాబు, సిరాజ్, కొండన్న, సవారన్న, ఉన్నారు.

ఉప్పల రోడ్డుకు మరమ్మతు చేయండి



అయిజ: అయిజ నుంచి ఉప్పలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరుగకముందే అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి పలకలు అక్కడేనా!



ఉండవెల్లి: మండలంలోని బైరాపురంలోని ఉపాధీ కూలీలు చేసిన పనులకు సంబంధించి, ఎన్ఆర్ఈజీఎస్ వివరాల పలకలను గ్రామ పంచాయతీ ముందే ఏర్పాటు చేయించి ఉంచారు. వాటిని పనులు చేసిన చోట ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. పనులు చేశారా, లేక పక్కకు పెట్టి ఉంచారా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులుకు సంబంధించిన వివరాలను తెలిపేందుకు ఎక్కడివి అక్కడికి చేర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో పరిశుభ్రత కరువు



ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాలపాడులో ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నా, దీన్ని పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. ఉప కేంద్రం ఉన్నా లేనట్లుగా ఉంటుందని, వైద్యులు వచ్చిపోతుండాలని పేర్కొన్నారు. భవనం ముందు కలుపు ఉన్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యాలను చూసే స్థలంలోనే అనారోగ్యాలు వస్తాయని త్వరగా శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రీ సైక్లింగ్ ఊసేలేదు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ప్రతి జీపీలో రూ.2.5లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పంట పొలాలకు అవసరమయ్యే కంపోస్ట్ ఎరువులను తయారీ చేయడం కోసం ప్రభుత్వం ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి సేకరించిన చెత్తాను గ్రామాల శివార్లలో, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. దీనివల్ల పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టినా అవి ప్రజలకు ఉపయోగపడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

తెలంగాణ ప్రభుత్వం పంచాయతీల్లో ప్రజలకు కావల్సిన సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నో పథకాలను చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2.5 లక్షల నిధులు కేటాయించింది. దీని ద్వారా ప్రతి జీపీల్లో సెగ్రిగేషన్ షెడ్‌ను నిర్మించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించింది. ఇక్కడ తయారు చేసిన కంపోస్టు ఎరువును గ్రామంలోని పంటలకు ఉపయోగించేందుకు రైతులకు విక్రయించాలని కార్యదర్శులకు సూచించింది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీలు సమకూర్చుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. దీనివల్ల ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతూ ముందుకు సాగడం లేదని, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతలేని కంపోస్టు ఎరువు..

పల్లెల అభివృద్ధిలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డుల నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో చేపట్టారు. అవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీల్లో కేవలం 88 షెడ్లలో మాత్రమే ప్రస్తుతం వానపాములను ఉపయోగించి గ్రామాల్లో సేకరించిన చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. వీటిలో కూడా ఎరువు సక్రమంగా తయారు కావడం లేదని రైతులు వాపోతున్నారు. అందులో తడి, పొడి చెత్తను వేయకుండా కేవలం మట్టిని మాత్రమే వేయడం వల్ల వానపాములు చనిపోతున్నాయని తెలుపుతున్నారు. మిగిలిన 36 షెడ్లలో ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు. దీనివల్ల కంపోస్టు ఎరువును తయారు చేసే ఊసే లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.



షేకుపల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు



జింకలపల్లి షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న చెత్త, సీసాలు

మండలాల వారీగా వివరాలు..

మండలం	జీపీలు	ఉపయోగంలో	నిరుపయోగంలో
ఇటిక్యాల	29	21	08
మానవపాడు	16	12	04
అలంపూర్	14	09	05
ఉండవెల్లి	16	13	03
రాజోళి	11	08	03
వడ్డేపల్లి	10	06	04
అయిజ	28	19	09



చాగాపురంలో తయారైన నాణ్యత లేని ఎరువు

వంద శాతం పనులు పూర్తి..



ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పనులు వంద శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం 21 పంచాయతీలలో వానపాములను ఉపయోగించి తడి, పొడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగిలిన 8 పంచాయతీలకు వానపాములు అందుబాటులో లేనందున ఎరువుల తయారీ చేపట్టలేదు. వానపాములు రాగానే వాటిలో కంపోస్టు ఎరువును తయారు చేయిస్తాం. షెడ్లలో తయారు చేసిన కంపోస్టు ఎరువును హరితహారం చెట్లకు వినియోగిస్తున్నాం. ఎరువు ఎక్కువగా తయారైన గ్రామాల్లో రైతులకు విక్రయించి నిధులను పంచాయతీలకు సమకూరుస్తాం.

– భాస్కర్, ఎంపీవో, ఇటిక్యాల

అభివృద్ధిని చూసి ఆదరించాలి



ప్రచారంలో ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను బహూకరించిన కురువలు

కేటీదొడ్డి: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం, గ్రామంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్పలు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. మండలంలోని వెంకటాపురం, పాగుంట, ముసల్‌దొడ్డి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు చెన్నయ్య, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక..

గద్వాల, గట్టు, మండలానికి చెందిన వివిధ గ్రామాల నుంచి గట్టు మండలంలోని బీజేపీ నుంచి మాజీ ఎంపీటీసీ నరేందర్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డిలకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

గట్టు: మాచర్లలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ, మాచర్ల మాజీ ఎంపీటీసీ మహేశ్వరమ్మతో పాటు మాజీ సర్పంచ్ తాయప్ప, బీజేపీ నాయకులు రాజుగౌడు, వీరేష్‌గౌడు, విజయ్‌గౌడు, మురళిగౌడు, లింగన్నలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తప్పెట్లమొర్సు సర్పంచ్ కృష్ణయ్యగౌడు, మాజీ సర్పంచ్ అశోక్, గట్టు పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాయాపురం రాముడు, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడు, లింగాపురం వీరేష్‌గౌడు, మండల కేంద్రానికి చెందిన చెందిన కొళాయి భాస్కర్, తారాపురం శివప్ప, వీరన్నగౌడు, చింతలకుంట మాజీ సర్పంచు మునిస్వామి అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హనుమంతు ఉన్నారు.

బీటీకి మరమ్మతు చేపట్టాలి



పెద్దపల్లి గ్రామ సమీపంలో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి–కుర్వపల్లి గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదకరంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. రైతులు రోడ్లకు అడ్డంగా గుంతలు తవ్వి వదిలేయడంతో రాత్రివేళలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు న్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం



శ్రీనగర్‌లో ఓటు వేయాలని అడుగుతున్న బీఎస్పీ నాయకులు

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీగనర్, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలలో గురువారం బీఎస్పీ మండల అధ్యక్షుడు శాంతకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి, మల్లీశ్వరి, మధన నరేష్ పాల్గొన్నారు.

పంటలను ముంచెత్తిన కాల్వ నీరు



పెద్దింటి పాండు పంటపొలాన్ని ముంచెత్తిన నీరు

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన నాగర్‌దొడ్డి రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన ప్రధాన కాల్వ తెగిపోవడంతో నీటి ప్రవాహం రైతుల పంటపొలాలను ముంచెత్తింది. కాల్వకు విడుదల చేసే నీరు అధికమొత్తంలో రావడంతో గురువారం అయిజ శివారులోని రైతు పెద్దింటి పాండు కంది పంట మునిగిపోయింది. దీని వల్ల మట్టి కొట్టుకపోయి పంటకు తీవ్ర నష్టం ఏర్పడింది. అనేక చోట్ల కాల్వలు కోతకు గురయ్యాయని, కొన్ని కాల్వలు తెగిపోయే స్థితికి చేరుకున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని, నీటిని తగినంతగా విడుదల చేయాలని రైతులు కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

- నలుగురికి తీవ్ర గాయాలు
- వేగంగా దూసుకొచ్చిన బస్సు
- పండుగకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం

శాంతినగర్: దసరా పండుగకు వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన ఘటన వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటిక్యాల మండలం చాగాపురానికి చెందిన పుల్లన్న తన కూతురు సరళ మనవరాలు శాన్వి, మనవడు ఎక్సోబాలను దసరా పండుగకు చాగాపురానికి తీసుకువచ్చాడు. పండుగ ముగిసినందున మెట్టినింటికి మానవపాడుకు కూతురు, మనవడు, మనవరాలితో బైక్‌పై బయల్దేరారు. శాంతినగర్ సెంటర్‌లో వెళ్తుండగా కర్నూలు వైపు నుంచి రాయచూర్‌కు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు బైక్‌పైకి దూసుకొచ్చి ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. పుల్లన్నకు కాలు విరగగా, ఇద్దరు చిన్నారులు, తల్లి గాయాలపాలై స్పృహ కోల్పోయారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి 108లో నలుగురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుల్లన్నకు కాలికి ఆపరేషన్ చేశారని, కూతురు సరళ, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని కుటుంబసభ్యులు తెలిపారు. అంతేగాక రోడ్డు సమీపంలో నిలిపిన కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారు దెబ్బతింది. కర్ణాటక ఆర్టీసీ బస్సులు అతివేగంతో వెళ్లడం వల్లే తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఆర్టీసీ బస్సులు వస్తున్నాయంటే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు తెలిపారు. కర్ణాటక బస్సులపై వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ బస్సు

సీఎం కేసీఆర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్ననాయకులు

మానవపాడు: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై లక్షకోట్లు వృధా చేసిన కేసీఆర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు శాంతకుమార్ తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు కాళేశ్వరం మేడికొండ ప్రాజెక్ట్‌పై ఫెయిలర్‌పై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్‌ల పేరుతో అక్రమంగా సంపాదించిన కేసీఆర్‌పై ఆస్తులను జాతీయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి, మల్లేశ్వరి, నాగజ్యోతి, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

అలంపూర్: సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల దృష్ట్యా సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను ఇక్కడ తనిఖీ చేపట్టి రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ పటేల్ భానోతు, ఎక్సైజ్ ఎస్ఐ అనంతరెడ్డి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ ఖలీద్ పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చక్రవర్తి, జగదీష్, ఐటీబీపీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం

గద్వాల అర్బన్: అంగన్‌వాడీలు విధుల్లో సమయపాలన పాటించాలని డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పాటించాల్సిన నియమాలపై వివరించారు. బీఎల్ఓలుగా ఉన్న టీచర్లు విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు పౌష్టిహారం అందించాలని, ప్రతి రోజు మధ్యాహ్న భోజన వివరాలను రికార్డులో నమోదు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగించాలన్నారు. ప్రతి టీచర్ తప్పనిసరిగా డ్రెస్‌కోడ్‌ను పాటించాలని చెప్పారు. సమావేశంలో సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్ అరుణ, పద్మావతి, సునీత, సురేఖ ఉన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



శాంతినగర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలు

శాంతినగర్: త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని శాంతినగర్ ఎస్ఐ నరేష్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్, వడ్డేపల్లి, మండలంలోని తనగల గ్రామాల్లో కేంద్ర బలగాలు, ఐటీబీపీ సిబ్బంది పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రభాకర్, హోంగార్డులు రాజు, మనోహర్, కేంద్ర ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.

గొడవలు చేస్తే కఠిన చర్యలు

మానవపాడు: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్ తెలిపారు. గురువారం ఇండో, టిబెట్ బార్డర్ పోలీసులు మానవపాడు, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో గొడవలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, ఇండో, టిబెట్ బార్డర్ పోలీసులు ఉన్నారు.

అలంపూర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



రాజోళిలో ప్రచారం చేస్తున్న సంపత్ కుమార్

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పల్లెపాడు, బోరవెల్లి, చండూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోనియమ్మ ప్రకటించిన ఆరు పథకాలు గ్యారంటీలతో, ఎస్సీ డిక్లరేషన్, వరంగల్ ఎస్సీ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా నెరవేరుస్తుందన్నారు.

రాజోళి: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని అలంపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్ కుమార్ అన్నారు. కొత్త రాజోళిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రజలు కూడా వారిని నమ్మరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, రామకృష్ణారెడ్డి, చిన్నిబాబు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి

గద్వాల అర్బన్: హమాలీల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని హమాలీ ఫెడరేషన రాష్ట్ర నాయకుడు వంగూరు రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీ యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా పార్టీలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఈశ్వర్, నర్సింహ, రాజన్న, నర్సింహులు, నూర్ అహ్మద్ ఉన్నారు.

శిథిలమైన వంతెన పునర్ నిర్మించండి



అయిజ – రాయచూర్ బ్రిడ్జిపై పడిపోయిన సూచికరాళ్లు

అయిజ: కర్నూలు–అయిజ రోడ్డు రహదారిలో పెద్ద వాగుపై గతంలో నిర్మించిన వంతెన శిథిలమైంది. అనేక సార్లు ప్రమాదాలు సంభవించాయి. బ్రిడ్జి పక్కన కిందిభాగంలో ఏర్పాటు చేసిన రాతి గోడ కొన్నేళ్ల కిందటే శిథిలమైంది. బ్రిడ్జి ఉన్నట్లు సూచించే రక్షణ రాళ్లు విరిగి పోయాయి. వాహనాలు దగ్గరకు వస్తేగాని చోదకులకు అక్కడ ప్రమాదం పొంచి ఉందని తెలియడంలేదు. అధిక బరువు కలిగిన వాహనాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తుంటాయి. ఇవి కర్నూల్ మీదుగా హైదరాబాద్‌కు నేషనల్ హైవేలో వెళ్లాల్సి ఉంటుంది. అయితే అడ్డదారిలో ఇవి అయిజ పట్టణం మీదుగా వెళ్లడంతో రోడ్లతో పాటు బ్రిడ్జి శిథిలమైంది. ఈ రోడ్డుపై ప్రతి నిత్యం పరిమితికి మించిన బరువుతో వాహనాలు వెళ్తానే ఉన్నాయి. దాంతో బ్రిడ్జి బీటలుబారింది. సంబంధిత అధికారులు అధిక బరువుగలిగిన అనుమతి లేని వాహనాలను నియంత్రించి, నూతన బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఎంతైనాఉంది.